

కొన్ని సహజమైన అందాలు ప్రకృతితో మమేకమై కనువిందు చేస్తుంటాయి. అలాంటిదే సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం రామునిపట్ల గ్రామ శివారులో సూర్యాస్తమయం సమయం, ఆ పక్కనే తాటి వనం ప్రకృతి గీసిన చిత్రం వలే సుందర దృశ్యం కనువిందు చేసింది.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)

పాత బస్టాండ్ సంగమేశ్వర గుడిలో

శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరుగనున్న మహాశివరాత్రి వేడుకల కోసం సంగారెడ్డిలో జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అతి పురాతనమైన సంగమేశ్వర ఆలయానికి కొత్త రంగులను వేయించారు. ఈ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. శివరాత్రి రోజున ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. పట్టణంలో ప్రతీ సంవత్సరం లాగే ఈ సారీ కూడా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జగ్గారెడ్డి వెంట టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, ఆలయ పూజారులు రాజ్ పంతులు, శివశర్మ తదితరులు ఉన్నారు.





సంగారెడ్డి సంగమేశ్వర ఆలయ గోశాలలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఆలయంలో శివరాత్రి వేడుకల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంటున్న జగ్గారెడ్డి

తపాస్‌పల్లి జల జగడం

వేసవికాలం ప్రారంభం కాకముందే చేర్యాల ప్రాంతంలో భూగర్భజలాల నీటిమట్టం అడుగంటడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంటల ఎదుగుదలకు సరిపడా నీరందక ఎండుముఖం పడుతుండడంతో అయోమయం చెందుతున్నారు. దీంతో కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిపై రైతాంగం ఆశలు పెట్టుకున్నారు. రిజర్వాయర్‌లోకి ఇటీవల పంపింగ్ చేపట్టడంతో మండుటెండల్లోనూ సాగునీటికి ఢోకా ఉండబోదని భావించారు. కానీ ఇటీవల అర్ధాంతరంగా మోటార్లు ఆఫ్ చేశారు. దీంతో నీరందక తమ ఆశలు అడియాసలైనట్టేనా అని రైతుల ఉసూరుమంటున్నారు. నీటి పంపింగ్ నిలిసివేత విషయం ఇప్పటికే రాజకీయపరంగా దుమారం రేపుతుండగా, ప్రాంతాల మధ్యన జగడం జరుగుతుంది.


- చేర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)

● ఇటీవల పంపింగ్ ప్రారంభం ● అంతలోనే నిలిపివేత..అడుగంటిన భూగర్భజలాలు ● ఎండుముఖం పడుతున్న పంటలు
● అయోమయంలో రైతాంగం ● చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని అన్నదాతల డిమాండ్

దేవాదుల ఎత్తిపోతలపథకం రెండవ దశద్వారా సముద్ర మట్టానికి సుమారు 540మీటర్ల ఎత్తులో 0.03టీఎంసీల సామర్థ్యంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించారు. గతంలో ప్రాధాన్యతగా ఇక్కడి చెరువులు, కుంటలన్నీ నింపేవారు. యేటా రిజర్వాయర్‌ను కనీస పరిమితి మేరకు నింపుతున్నప్పటికీ స్థానికంగా మారుతున్న రాజకీయ పరిణామాల ఫలితంగా ఇక్కడి చెరువులు, కుంటలను పూర్తిస్థాయిలో నింపడం లేదు. కొన్నినెలలక్రితం రిజర్వాయర్‌ను నింపినా పొరుగు ప్రాంతాలకు తరలించడం స్థానికంగా దుమారం రేపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభదశలో ఉండడంతో అనూహ్యంగా భూగర్భజలాల నీటి మట్టం పడిపోయింది. దీంతో బోర్లలో నుంచి నీరు సరిగా రాక పంటలకు నీరందడం లేదు. వచ్చే నీటిని పొదుపుగా వాడుకుంటూ ఓవైపు నీరుపెట్టిన తరువాత మరోవైపు నీటిని పడుతున్నా సరిపడక చేలు వాలిపోతూ ఎండిపోతున్నాయి. గోదావరి నదిలో నీటిలభ్యత ఉండడంతో పంపింగ్ చేపట్టి చెరువులు నింపాలని ఇక్కడి రైతాంగంతో పాటు పలు పార్టీలు కోరుతూ వచ్చాయి. ఈనెల 11న మోటార్లు ఆన్ చేయడంతో ఒక పంప్ ద్వారా నీరు రిజర్వాయర్‌లోకి చేరింది. కనీస నీటినిల్వ సామర్థ్యం మేరకు నింపిన అనంతరం చెరువులకు మళ్లిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో ఎప్పుడెప్పుడు సాగునీటిని అందిస్తారా అని ఇక్కడి అన్నదాతలు ఎదురుచూస్తున్న క్రమంలో పొరుగు మండలాల రైతులు కూడా ఇదేతీరులో నీరు ఆశిస్తూ రాజకీయ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల కొండపాక మండలంలోని పలు గ్రామాలకు నీటిని విడుదల చేశారు. చేర్యాల వైపునకు మళ్లకుండా ఐనాపూర్ శివారులో షట్టర్ ఏర్పాటుచేశారు. దీంతో ఇక్కడి చెరువులు నింపకుండా తరలించడం తగదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదేవిషయమై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పంపులు బంద్ చేయడం తగదని, వెంటనే చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. పంప్‌లు బంద్ చేయడంతో రిజర్వాయర్‌కు నీరుచేరని నేపథ్యంలో కుడి, ఎడమకాలువల పరిధిలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు తదితర మండలాల చెరువులను నింపడం అసాధ్యంగా మారింది. రానున్న వేసవికాలంలో మరిన్ని ఇబ్బందులు పడకతప్పని పరిస్థితి నెలకొన్నది. ఆందోళనలు, రాజకీయ నేతల చర్యలతో చెరువులు నింపేందుకు దేవాదుల అధికారులు చర్య లు తీసుకుంటారా లేదా రానున్న రోజుల్లో చెరువులు నింపకపోయినా కాలువలో బోర్లు వేసుకుని పంటకు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తారా... అన్న విషయం ఆసక్తికరంగా మారింది.



చేర్యాల, కొమురవెల్లి మండలాల వైపు నీళ్లురాకుండా కాలువలో బిగించిన ఇనుప రేకు



నీరు లేక బీటలు పడుతున్న వరి పొలం

తడులు పెడుతున్నా ఎండిపోతుంది



ఎకరంలో వరి సాగు చేస్తున్నాను. వర్షాకాలంలో రెండున్నర ఎకరాలు సాగు చేసేవాడిని. సాగు నీటి కోసం ఒక బోరు ఉంది. నీరు సరిగా రాకపోవడంతో మడుల చొప్పున వరుస తడులు పెట్టుకుంటున్నాను. అయినప్పటికీ పంట ఎండుముఖం పడుతుంది. నీళ్లు లేకపోతే మొత్తం ఎండిపోయి నష్టంజరిగే ప్రమాదం ఉంది.

- కొట్టె రాములు, చేర్యాల

విద్యుత్ సరఫరాలోనూ కోత

గతంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సాయంత్రం 5-45 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిలిపేశారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ దృష్ట్యా రాత్రి 10 గంటల వరకు నిలిపివేస్తున్నారు. గంట అదనంగా కోత విధించకుండా ఉండి ఉంటే కొంతమేరనైనా పొలానికి నీరుపట్టుకునేవారమని, ప్రస్తుతం ఆ అవకాశం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు.

వాటర్ ప్రాబ్లం



రిజర్వాయర్‌లో తగ్గుముఖం పట్టిన నీరు

చెరువులు నింపాలి

చేర్యాల/దౌల్తాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలను చేర్యాల ప్రాంతంలోని చెరువులు కుంటలు నింపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కొమురవెల్లి నుంచి ఐనాపూర్ శివారులోని రిజర్వాయర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడారు. చేర్యాల ప్రాంత రైతాంగ శ్రేయస్సుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించినా ఇక్కడి రైతుల ప్రయోజనాలు కాలరాస్తూ నీటిని ఇతర ప్రాంతాలకు అందిస్తుండటం తగదన్నారు. తక్షణమే నీటిని విడుదల చేసి చెరువులు నింపి పంటలను కాపాడాలని కోరారు. ర్యాలీలో నాయకులు కొంగరి వెంకట్ మావో, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, షఫీ, రాళ్ల బండి నాగరాజు, శోభ, బాలకిషన్, బాలరాజు, సురేందర్ పాల్గొన్నారు.

శేరిపల్లిలో రైతుల ధర్నా

దౌల్తాబాద్ మండల పరిధిలోని శేరిపల్లి గ్రామ రైతులు కొండపోచమ్మ నుంచి వచ్చే కాలువల ద్వారా చెరువులు నింపి సాగు పంటలకు నీళ్లు అందించాలని మంగళవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. నర్సంపేట మీదుగా వచ్చే కాలువ ద్వారా షేర్‌పల్లి గ్రామ చెరువు నింపాలని పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు చెప్పినా స్పందించలేదని వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తొగుట సీఐ లతీఫ్ రైతులతో జిల్లా ఇరిగేషన్ డీఈని మాట్లాడించారు. రెండురోజుల్లో నీటిని సరఫరా చేసి చెరువులు నింపుతామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, కానిస్టేబుల్, రాజా గౌడ్, స్వామి సతీష్, తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

నీళ్లగోస మొదలైంది..నిధులివ్వండి

● ఎంపీడీవోకు గ్రామ కార్యదర్శుల విన్నపం

దుబ్బాక, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అప్పుడే గ్రామాల్లో నీళ్లగోస మొదలైందని, నీటి కష్టాలు తీర్చేందుకు నిధులు ఇవ్వాలని" దుబ్బాక మండల గ్రామకార్యదర్శులు మంగళవారం అధికారులకు విన్నవించారు. దుబ్బాక మండల అభివృద్ధి అధికారి భాస్కరశర్మను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారికి తమ గోడును విన్నవించేందుకు లేఖ రాశారు. గ్రామాల్లో పాలకమండలి పదవీకాలం ముగిసిన నాటి నుంచి సమస్యల పరిష్కారానికి అప్పులు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ దీపాలు, దోమల మందు, ఫాగింగ్ చేయించడం లాంటి పనులను చేశామని, ఇక తమతో పనులు చేయించడం కాదన్నారు. గ్రామాలల్లో నీటి సమస్య మొదలైందనీ, తమకు నిధులివ్వాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో గ్రామకార్యదర్శుల సంఘం నాయకులు మురళి, రఘురామకృష్ణ, వజ్రవ్వ, కిషన్, తదితరులున్నారు.

మురిపించారు.. మరిచారు

● ఇళ్లు కేటాయించి రెండేళ్లు ● పట్టాలు ఇచ్చినా పూర్తికాని పనులు
● ఎవరికీ పట్టని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల గోడు ● సొంతింటి కల నెరవేర్చాలని వేడుకోలు

హుస్నాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూం ఇళ్ల డ్రాలో తమ పేరు రావడంతో సొంతింటి కల నెరవేరిందని పేదలు సంబురపడ్డారు. అధికారుల చేతుల మీదుగా పట్టాలు అందుకోగానే అదృష్టం వరించిందని ఉప్పొంగిపోయారు. తీరా ఆ ఇళ్లు పూర్తిగా నిర్మాణం కాకపోవడంతో అందులో నివసించే భాగ్యం లేక ఉసూరుమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇచ్చారు. అయితే ఇందులో పలువురికి కేటాయించిన ఇళ్లు పూర్తికాకపోవడంతో తమ ఇళ్లు పూర్తి చేసి ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇదీ హుస్నాబాద్‌లోని డబుల్ ఇళ్ల లబ్ధిదారుల గోస..

మొత్తం పూర్తి కాని నిర్మాణాలు

హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో 2017లో అప్పటి ఆర్థిక, వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులకు శంకుస్థాపన చేశారు. మొదటి విడత 160, రెండో విడతలో 400 ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం 560 ఇళ్ళకు జి ప్లస్ 2 పద్ధతిన నిర్మాణం చేపట్టారు. కానీ ఈ పనులు వివిధ కారణాలతో ఆగుతూ సాగుతూ వచ్చాయి. ప్రారంభించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. దీంతో పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది.

168 ఇళ్లు మాత్రమే పూర్తి..

హుస్నాబాద్‌కు 560 ఇళ్లు మంజూరైనప్పటికీ వివిధ కారణాలతో 288 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు జరిగాయి. ఇవి కూడా వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 2023 ఫిబ్రవరిలో డ్రా తీసి 264 మంది లబ్ధిదారులకు కేటాయించారు. ఇందులో 168 ఇళ్లు పూర్తయ్యాయి. 96 ఇళ్లు 80 శాతం, 24 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయి. ప్రస్తుతం 168 ఇళ్లలో లబ్ధిదారులుంటుండగా 96 ఇళ్లు పూర్తికాకపోవడంతో వీటిని పూర్తి చేసి ఇవ్వాలని మిగతా లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు. ఇళ్లు కేటాయించి రెండేళ్లు దాటుతున్నా వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వాటిని పూర్తిచేసి ఇళ్లలోకి పంపించాలని కోరుతున్నారు.

గౌరవెల్లి నిర్వాసితులు..

పూర్తయిన ఇళ్లలో కొంత మంది గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితులు ఉంటుండటంతో మంజూరైన

మిగతా 8వ పేజీలో...



స్లాబ్ దశలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

బొంతలతో బెడ్‌షీట్లు చేసిస్తామని మోసం

● మెదక్ జిల్లా కేంద్రంలోని పలు వీధుల్లో రూ. వేలు వసూలు చేసి పరారు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా మోసగాళ్లు నిత్యం ఏదో రూపంలో బురిడీ కొట్టిస్తుంటారు. మోసానికి కాదేది అనర్హం అన్నట్టు మెదక్‌లో పాత బొంతల పేరిట వందలాది మంది మహిళలను మోసం చేశారు మోసగాళ్లు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చామని గోపాల్‌పేటలో బస చేస్తున్నట్టు చెప్పారు. తమకు పాత బొంతలు ఇస్తే కొత్త బెడ్‌షీట్లు తయారుచేసి ఇస్తామని చెప్పి నమ్మబలికారు. ఒక్కో బొంతకు రూ. 500 ఇస్తే నాలుగు రోజుల్లో అందమైన కొత్త బెడ్‌షీట్ తయారు చేసి ఇస్తామని నమ్మించారు. మహిళలను ఆకర్షించడానికి తమ వద్ద ఉన్న అందమైన బెడ్‌షీట్ నమూనా చూపించారు. దీంతో పాత దుస్తులే కదా... తక్కువ ధరకే బెడ్‌షీట్ వస్తుందంటూ గృహిణులు ఒక్కొక్కరు మూడు నాలుగు ఆర్డర్ ఇచ్చి రూ.వేలు సమర్పించుకున్నారు. ఒకేచోట కాకుండా మెదక్ పట్టణంలోని జమ్మికుంట, కువ్వతుల్ ఇస్లాం, నర్సిఖేడ్ ప్రాంతాల్లో వందల మంది మహిళల నుంచి డబ్బులు వసూలు చేసుకొని వెళ్లిపోయారు. వారం రోజులైనా తయారీదారులు రాకపోవడంతో వాళ్లు ఇచ్చిన నంబర్ (8007423413)కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని గ్రహించిన లబోదిబోమంటున్నారు. కొందరు మహిళలు తయారీ దారుల ద్విచక్ర వాహన నంబర్‌ప్లేట్‌ను ఫోన్‌లో ఫొటో తీశారు. ఒక్కో బెడ్‌షీట్‌కు రూ. 500 మాత్రమే కదా అనుకుంటే.. ఇలా వందల మంది నుంచి రూ. లక్షల్లో వసూలు చేసినట్టు తెలుస్తున్నది.

వరుస చోరీలతో జనం బెంబేలు!

● చిన్నకోడూరు మండలంలో పనిచేయని సీసీ కెమెరాలు
● పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాల కట్టడి 8

భర్తకు సపర్యలు చేయలేక అల్లుడితో కలిసి హత్య

● సహజ మరణంగా చిత్రీకరించే యత్నం
● బంధువులు గట్టిగా నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి 7

మల్లన్న ఆలయ బుకింగ్ ఆదాయం రూ.48.10లక్షలు

● గతేడాది రూ.56.03 లక్షలు.. ఈ సారి రూ.8లక్షలు తగ్గుముఖం

చేర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ వారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడులు, తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరాళాలు, ఇతరత్రా రూపంలో శనివారం రూ.2,84,716, ఆదివారం రూ.39,19,799, సోమవారం రూ.6,06,168, చొప్పున రూ.48,10,683 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.56.03లక్షలు ఆదాయం సమకూరగా, ఈసారి సుమారు రూ.8లక్షలమేర తగ్గింది. మొదటివారం రూ.9లక్షలు, రెండవవారం రూ.16.55 లక్షలు, మూడవ వారం రూ.13లక్షల చొప్పున మొత్తం కలిపి సుమారు రూ.40లక్షల ఆదాయం తగ్గింది. నాలుగోవారం రూ.4లక్షలు పెరిగినా తిరిగి 5వ వారం మరోమారు రూ.8లక్షలు తగ్గడం చర్చనీయాంశంగా మారింది.

గతేడాది మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఉండటంతో మల్లన్న దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చినందున ఆదాయం పెరిగిందని, ప్రస్తుతం భక్తుల తాకిడి తక్కువగా ఉండటంతో ఆదాయం తగ్గుముఖం పట్టిందని ఈవో రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.








ముగిసిన జగన్నాథస్వామి ఆలయ ఉత్సవాలు


ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పరిధిలో జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజులుగా జరుగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. వినాయకుడు, లక్ష్మీదేవి, ఆంజనేయస్వామి, శివాలయం, దుర్గాదేవి, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఒరిస్సా పూరీజగన్నాథస్వామి ఆలయానికి చెందిన వేదపండితులు విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా హోమాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు చంద్రారెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు.














మండలాల అభివృద్ధి కృషి

● సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య అన్నారు. మంగళవారం రాయికోడ్ చౌరస్తాలో రూ.1.70 కోట్లతో చేపట్టిన సెంటర్ లైటింగ్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింహులు, నాయకులు కేదారినాథ్ పాటిల్, సతీష్‌కుమార్, హనుమాగౌడ్, విఠల్, కాశీనాథ్, ఖాజాపటేల్ ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీవైఎస్‌వో, స్పెషల్ ఆఫీసర్ ఖాసీంభేగ్



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ ఖాసీంభేగ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా యువజన క్రీడల అధికారి(డీవైఎస్‌వో), సంగారెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ ఖాసీంబేగ్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దత్తత పాఠశాలగా కేటాయించిన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా లేదాని ఆరాతీశారు. ఉపాధ్యాయుల బోధన, మాదిరి పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల విభజన, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

● మునిపల్లి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) :పదోతరగతి ఫలితాల్లో మండలాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషలాఫీసర్ రామాచారి సూచించారు. మంగళవారం నాడు మండల పరిధిలోని అంతారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను తనిఖీ చేసి ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సయ్యద్ సాబేర్ తదితరులు ఉన్నారు.

కొప్పోల్ జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయ్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయ ఆవరణలో నిర్వహించే జాతర ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25 నుంచి 28 వరరకు జరిగే ఈ ఉత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ గ్రేస్‌బాయ్ పోలీస్, వైద్య, విద్యుత్, శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో చర్చించి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, వైద్యాధికారి శరిపొద్దిన్, వికాస్, ఆలయ కమిటీ సభ్యులు పద్మబాపిరాజు, రాజ శేఖర్‌రెడ్డి, పరమేశ్వర్‌రరెడ్డి, సీతారామారావు, కందుకూరి రవీందర్, గాండ్ల సంగమేశ్వర్, సతీష్‌గౌడ్, శంకర్‌గౌడ్, ప్రభుసార్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోచుకుని రోడ్డున పడేస్తారా..?

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్


సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనేక సంవత్సరాలుగా కార్మికుల శ్రమ దోచుకుని రోడ్డున పడేస్తారా..? అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ముందు మంగళవారం ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురిచేసి డ్యూటీలో నుంచి తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులు పరిశ్రమ అభివృద్ధికి గత నాలుగు సంవత్సరాలుగా కష్టపడ్డారని వారిని ఎలా తొలగిస్తారన్నారు. అకారణంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం డిసిఎల్ నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, కార్యదర్శి సాయిలు, నాయకులు రాజయ్య, ప్రవీణ్‌కుమార్, మహిపాల్, రాజిరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

శివ్వంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా బోధించి ఆనందంగా గడిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

కొల్చారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. క్రీడలలో గెలుపొందిన వారికి ఛత్రపతి శివాజీ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామని సంఘం అధ్యక్షులు పల్వంచ దీక్షిత్ గౌడ్ తెలిపారు.






వివరాలు సేకరిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో మృతదేహం

మంచాన పడిన భర్తకు సపర్యలు చేయలేక

అల్లుడితో కలిసి హత్య

- సహజ మరణంగా చిత్రీకరించే యత్నం
- బంధువులు నిలదీయడంతో విషయం వెలుగులోకి..
- హత్య జరిగిన రెండు రోజులకు పోలీసుల విచారణ

పాపన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచాన పడిన భర్తకు సేవలు చేయడం కష్టంగా భావించిన ఓ భార్య తన అల్లుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని బాచారం గ్రామానికి చెందిన కర్రెల ఆశయ్య (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 15న పొలం వద్ద కిందపడగా కాలుకు, నడుముకు గాయమైంది. నడవలేని స్థితిలో మంచానికే పరిమితవడంతో సపర్యలు చేయాల్సి వస్తుందని, వైద్యానికి డబ్బులు కూడా ఖర్చు అవుతాయని భావించిన భార్య శివమ్మ, అల్లుడు రమేష్‌తో కలిసి ఆదివారం అర్ధరాత్రి టవల్‌తో గొంతుకు ఉరి బిగించి హత్య చేశారు. ఇది సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఇంటికి చేరుకున్న బంధువులు, గ్రామస్థులు ఆశయ్య మృతదేహాన్ని పరిశీలించగా గొంతు వద్ద కమిలిన గాయం కనిపించింది. దీంతో అంత్యక్రియలు చేయకుండా వారిని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. రాత్రి సమయం లో పోలీసులకు విషయం తెలుపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ హత్య విషయంపై కొంతమేర స్థానిక పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ అంతగా పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి తన బృందంతో రెండు రోజుల తరువాత మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

మునిపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ హెచ్చరించారు. కొండాపూర్ సీఐ వెంకటేశ్, మునిపల్లి ఎస్సై రాజేశ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కుమార్తె ఆలియాబేగంను ఈ నెల 11న అదే గ్రామానికి చెందిన వీరారెడ్డి, విజయ్ రెడ్డిలు కొట్టడంతో ఈనెల 16న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై సోషల్‌మీడియాలో కొందరు వివిధ రకాల పోస్టులు పెడుతూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టులు చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలిక పోస్టుమార్టం రిపోర్టు వచ్చేంత వరకు ఏమీ తేల్చలేమన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి మద్యానికి బానిసైన ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధి నార్సింగిలో జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సంజీవ్ కుమార్ (25) ఉపాధి నిమిత్తం వచ్చి కామారెడ్డి జిల్లాలో గప్‌చుప్ బండి నిర్వహించేవాడు. అక్కడ శ్రీలత అనే అమ్మాయితో పరిచయం ఏర్పడి, ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. కొన్ని నెలలుగా మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో గప్‌చుప్ బండిని నిర్వహిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై నిత్యం మత్తులో ఉండేవాడు. భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఒంటరి వాడైన సంజీవ్‌కుమార్ సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మెదక్ ఆసత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



శేకమ్మ మృతదేహం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా పిట్లం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్గాపూర్ మండలం అంతర్‌గాంకు చెందిన శేకమ్మ (50) అనే మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమె భర్త సంగయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. భార్యాభర్తలు మంగళవారం కామారెడ్డి జిల్లా కొడప్‌గల్‌కు బైక్‌పై వెళ్తుండగా, పిట్లం సమీపంలోని మార్దండ వద్ద బులేరో వాహనం ఢీ కొట్టింది. దీంతో శేకమ్మ చనిపోయింద. భర్త సంగయ్య పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఆయనను చికిత్స నిమిత్తం పిట్లం వైద్యశాలకు తరలించారు.

చేపల వేటకు వెళ్లి..

టేక్మాల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బొడ్మాట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బొడ్మాట్‌పల్లి గ్రామానికి చెందిన చీలపల్లి లక్ష్మయ్య (59)ఈనెల 14న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. 17న సాయంత్రం గ్రామ శివారులో ఉన్న గుండు వాగులో శవమై కనిపించాడు. గుండు వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి మృతి చెందినట్లు మృతుడి భార్య చీలపల్లి పోచమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య

టేక్మాల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో విసుగు చెందిన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి తంప్లూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి అశోక్ (38)కు 20 ఏళ్ల క్రితం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన వెంకటలక్ష్మితో వివాహం జరిపించారు. పదేళ్ల నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 16న కూడా గొడవ జరిగింది. దీంతో భార్య హైదరాబాద్ వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన అశోక్ ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. తల్లి చాకలి పోచమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని ఆమె భర్తను చంపే ప్రయత్నం చేసిన కేసులో టూటౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణ శివారులోని గుండ్ల చెరువుకు చెందిన మెరుగు శ్రావణ్ ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఆమె భర్తను చంపేందుకు కొంత మందితో కలిసి పణాళిక వేసి ఆమె భర్తను కిడ్నాప్ చేశారు. కాళ్లు చేతులు కట్టేసి బంధించి కర్రలతో దాడి చేశారు. తప్పించుకుని వచ్చిన బాధితుడు ఈ మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపిచినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

మట్టి.. చెరబట్టి..

జోరుగా అక్రమ తవ్వకాలు.. చెరువులు పొలాల నుంచి తరలింపు
తరలింపు కోసం ఫార్మేషన్ రోడ్డు.. పట్టించుకోని అధికారులు



మట్టి తవ్వడంతో క్వారీని తలపిస్తున్న కందిలోని పగడం చెరువు

కంది, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి కూతవేటు దూరంలో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి పూట చెరువులు, కుంటలను కొల్లగొడుతున్నారు. అధికారులంతా ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడిలో ఉండగా, అక్రమార్కులు గుట్టుగా దందా కానిస్తున్నారు. కంది మండలంలోని పగడం చెరువులో రెండు హిటాచీలు, పది టిప్పర్లలో మట్టి తరలించారని, ఇందుకు ఎలాంటి అనుమతులు లేవని స్థానికులు చెబుతున్నారు. అలాగే, ఎద్దు మైలారంలో సర్వేనెంబర్ 140 లోని ప్రభుత్వ భూమిలో దాదాపు 400 ట్రిప్పుల మొరం తవ్వి తరలించారు. చుట్టూ పొలాలు ఉన్నా.. గట్టు చప్పుడు కాకుండా క్వారీని తలపించేలా తవ్వకాలు జరిపారు. దీనివెనుక ఆ గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నాయకుల హస్తం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

భూమి లీజుకు తీసుకుని..

జిల్లాలో నక్కవాగు పరివాహక ప్రాంతం విస్తరించి ఉన్న ఆయా గ్రామాల్లోనే ఈ మట్టిదందా ఎక్కువగా సాగుతోంది. ఈ వాగు పక్కనే ఉన్న భూమల్లో ఎక్కవగా ఇసుకపొరలున్నాయి. మట్టిదళారులు రైతులకు అరకొర డబ్బు ఆశచూపి పచ్చని పంట పొలాల్లోని పై పొరల్లో ఉండే నల్లమట్టిని ఇటుక బట్టీలకు, ఒకటి నుంచి రెండు మీటర్ల లోతు నుంచి వచ్చే ఇసుకపొరలున్న మట్టిని కృత్రిమ ఇసుక తయారీ కోసం తరలిస్తున్నారు. దీంతో ఆ పొలాలు ఇప్పుడు క్వారీలను తలపిస్తున్నాయి. ఇలా తరలించిన మట్టిని బ్యాతోల్, ఎర్ధనూర్, చిద్రుప్ప, ఆరుట్లలోని నక్కవాగు చుట్టపక్కల కుప్పలుగా పోసి నిల్వ చేసుకుంటున్నారు. అదను చూసుకుని కృత్రిమ ఇసుకను తయారుచేస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఒక టిప్పర్‌కు రూ.6 వేల చొప్పున విక్రయిస్తున్నారు.



కంది మండలం బ్యాతోల్‌లో కృత్రిమ ఇసుకతయారీ కోసం నిల్వ చేసుకున్న మట్టి (ఫైల్)

అక్రమంగా రోడ్డు ఏర్పాటు

ఆరుట్ల నుంచి బ్యాతోల్‌కు మట్టిని తరలించేందుకు ఏకంగా నక్కవాగుపై అక్రమంగా మొరంతో ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటును సైతం ఏర్పాటు చేశారు. ఒక వాగుపై నుంచి రోడ్డును ఏర్పాటు చేసుకోవాలంటే అధికారుల నుంచి ఎన్ని అనుమతులు కావాలి. కానీ మట్టి దళారులు మాత్రం ఇవేం పట్టించుకుకోకుండా, ఎవ్వరిని లెక్క చేయకుండా రోడువేసి చక్కగా రాకపోకలు సాగిస్తున్నారు.

నామమాత్రంగా చర్యలు

మట్టి దందా ఇంతలా జరుగుతున్నా, నక్కవాగుపై ఏకంగా రోడ్డు ఏర్పాటు చేసిన అధికారుల చర్యలు మాత్రం తూతూమంత్రంగా సాగుతున్నాయి. ఇటీవల ఆరుట్ల శివారులోల అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న ఒక హిటాచీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని, అదే రోజు వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా ఎక్కువగా సెలవు రోజుల్లో పట్టపగలు, మిగతా రోజుల్లో రాత్రి వేళల్లో జరుగుతోంది. సెలవు రోజుల్లో, రాత్రి సమయాల్లో అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేస్తే స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

మట్టిని తరలిస్తే చర్యలు

అనుమతులు లేకుండా అక్రమంగా చెరువుల్లో గానీ, ప్రభుత్వస్థలాల్లో ఎవరైనా మొరం, మట్టిని తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటాం. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదు. ఎంతవారినైన వదలిపెట్టం. అందరిపైనా కేసులు పెడతాం. వాహనాలను సీజ్ చేస్తాం. చెరువుల, కుంటలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం.

విజయలక్ష్మి, తహసీల్దార్, కంది

చెరువుకు చెర..

ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి



చెరువులో మట్టిని పోసిన దృశ్యం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెరువులను కొందరు అక్రమార్కులు చెరబడుతున్నారు. శిఖం భూముల్లో పాగా వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో అధికార పార్టీ నాయకులు చెరువులను పూడుస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బొబ్బాయిపల్లి గ్రామంలోని ధర్మచెరువు గురికాగా, గ్రామస్థుల ఫిర్యాదుతో రగంలోకి దిగిన అధికారులు 1.20 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా లకుడారం ఇసుక చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒకరు తన పట్టా భూమి మొత్తాన్ని నల్లరేగడి మట్టితో నింపి వేశారు. గ్రామస్తుల ఫిర్యాదు రెవెన్యూ అటు ఇరిగేషన్ అధికారులు పనులను నిలిపివేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఎమ్మార్వో బదిలీ కావడంతో ఆ నాయకుడు రెండు రోజుల్లోనే భారీ ఎత్తున తన భూమిలో మట్టితో నింపివేశాడు. దీంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలు చేపట్టకూడదు..

చెరువుల పరిధిలో పట్టా భూములు ఉన్నప్పటికీ రైతులు ఆ భూములలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదు. ఎవరైనా చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

సుజాత, ఎమ్మార్వో

డబుల్ బెడ్‌రూం కాలనీలో కార్డెన్ సెర్చ్

90 బైక్‌లు, 5 ఆటోలు స్వాధీనం



తూప్రాన్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం కాలనీలో మంగళవారం వేకువ జామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగాకృష్ణ ఏడుగురు ఎస్సైలు కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగితాలు సరిగ్గా లేని 90 బైక్‌లు, 5 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. పది రోజుల్లో వాహనాల కాగితాలు చూపించి, వాటిని తిరిగి తీసుకువెళ్లవచ్చునని ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఏడుగురు ఎస్సై ఆధ్వర్యంలో ఏడు బృందాలుగా, సుమారు 95 మంది పోలీసు సిబ్బంది ఈ కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకం

- ఎన్నికల పరిశీలకులు మహేశ్ దత్ ఎక్కా

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకమని నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేశ్ దత్ ఎక్కా అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆయన నోడల్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు తారా కళాశాల, అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్‌లోని డీఆర్‌సీ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దని, ఎన్నికల విధులకు హాజరుకాకుంటే ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు అందజేసి, సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, నోడల్ అధికారుల, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 26 నుంచి 'గీతం'లో వర్క్‌షాప్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వర్క్‌షాప్ జరగనుంది. 'పదార్థాల నిర్మాణ విశ్లేషణ కోసం ఎక్స్ రే డిఫ్రాక్షన్' అన్న అంశంపై జాతీయ స్థాయిలో మార్చి 26 నుంచి 28 వరకు ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు గీతం యజమాన్యం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఐఐటీ హైదరాబాద్ లోని మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్ (ఎంఎస్‌ఎంఈ) విభాగానికి చెందిన ప్రొఫెసర్ రంజిత్ రామదురల్ వర్క్‌షాప్‌లో ప్రధాన వక్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 24వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర వివరాల కోసం 98607 82128ను సంప్రదించాలని వివరించారు.

అర్హత ఉన్నా రుణమాఫీ చేయరా

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీకి అర్హతలు ఉన్నా రుణమాఫీ చేయలేదని కల్హేర్‌కు చెందిన రైతు సంగమేశ్వర్‌రావు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడికి విన్నవించారు. తాను 2017లో కల్హేర్ ప్రాథమిక సహకార సంఘంలో రూ.99 వేల పంట రుణం తీసుకున్నానన్నారు. అయినప్పటికీ గత ప్రభుత్వ హయాంతోపాటు ప్రస్తుతమూ మాఫీ వర్తింపజేయలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై గత డిసెంబరు 9న ప్రజా వాణిలోకలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని, అయినప్పటికీ ఎలాంటి సమాచారం లేని, ఇప్పటికైనా స్పందించి రుణమాఫీ చేయించాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సాగునీరు. తాగునీరు. విద్యుత్ అంతరాయం, రైతుభరోసా, రబీ సీజన్‌కు సాగునీటి సరఫరా వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కింద అర్హులైన అందరికీ పథకం వర్తిస్తుందన్నారు. అంతకుముందు సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా ఈ అంశాలను సమీక్షించారు.

అవసరమైన చర్యలు చేపట్టాం

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి వివరించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద అర్హులైన అందరికీ పథకం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులకు అందిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు రామ్మూర్తి, సదానందం, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, డీఏవో రాధిక, డీపీవో దేవకీదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంపు.. కంపు వద్దు

కొనసాగుతున్న ఆందోళనలు
14వ రోజు బతుకమ్మ ఆడి నిరసనలు



బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 18 (ఆంధ్యజ్యోతి): మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ వద్దంటూ స్థానికుల నిరసనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. మంగళవారం 14వ రోజు కూడా రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానందరెడ్డి అధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ఆందోళనలు చేపట్టారు. నల్లవల్లి గ్రామస్థులు మెదక్- హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు రాష్ట్ర చుక్క రాములు పాల్గొన్నారు. డంపు యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో భాగంగా గుమ్మడిదలలో మహిళలు నాయకులతో కలిసి బతుకమ్మ ఆటలు పాటలు పాడి వినూత్న నిరసనలు తెలియజేశారు గ్రామాలలో రిలే నిరహదీక్షలు కొనసాగాయి. =

రెండవరోజుకు చేరిన దీక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్యారానగర్‌లో డంపుయార్డు వద్దంటూ నర్సాపూర్‌లో చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం రెండవరోజుకు చేరాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ పార్టీలన్నీ కలిసి అఖిలపక్షం ఏర్పాటు చేసి జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నారు. మంగళవారం దీక్షలో శ్రీధర్‌గుప్తా, బిక్షపతి, రిజ్వాన్, లక్ష్మణ్, నాగభూషణంతోపాటు పలువురు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా పలువురు నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మన్



సీఎం రేవంత్ రెడ్డితో దేవేందర్ రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ను ఉమ్మడి మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మంగళవా రం కలుసుకున్నారు. సహకార సంఘాల కాలపరిమితిని ఆరు నెలల పాటు పొడగించినందుకు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి జానారెడ్డినీ ఆయన కలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, తదితరులు ఉన్నారు.



భోగ్ భండార్ నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ

బంజారాల మార్గదర్శి సంత్ సేవాలాల్

పుల్‌కల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ బంజారాల మార్గదర్శి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జాట్రోత్ హరికిషన్ నాయక్ అన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన సేవాలాల్ దేశమంతటా తిరిగి లంబాడీలను ఏకతాటిపైకి తీసుకువచ్చారన్నారు. అప్పట్లోనే నిజాం పాలకులకు ఎదురొడ్డి నిలిచిన ఘనత ఆయనదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహ బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అంతకు ముందు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భోగ్‌భండార్ నిర్వహించారు. గిరిజన విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బంజారాల పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు ఆచార్య రజనేష్, విజయ్ కుమార్, సునీత, జోషి శ్రీపాద, గౌరానిక్ వాడి రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌నాయక్, సభ్యులు రాజునాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుతున్నది బీజేపీయే

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



విలేకరుతో మాట్లాడుతున్న ఎంపీ

సిద్దిపేట క్రైం,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అప్పుల్లో ఉంది.. ఇప్పుడు రాష్ట్రాన్ని కాపాడుతున్నది కేంద్రమేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలోని విద్రోహశక్తులు విదేశాలతో కలిసి దేశాన్ని విడదీయలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. తెలంగాణలో ఇప్పుడు అందరూ బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 10 వేల మెడికల్ సీట్లు పెంచారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే 317 జీవోను ఎత్తివేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, విద్యాసాగర్ రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, బాసంగారి వెంకట్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో 52 వేల ఉద్యోగాలు

- డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

మెదక్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు భంగపాటే ఎదురైందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 52 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టక పోవడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదోవన పట్టిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం అబివృద్ధి పథకంలో దూసుకుపోతుందన్నారు. సమావేశంలో టీపీసీసీ నాయకులు సుప్రభాత్‌రావు, హఫీజుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, అవారి శేఖర్, లింగం, వెంకటరమణ, సురేందర్ గౌడ్, క్రిష్ణాగౌడ్, ఆంజనేయులు గౌడ్, మధుసూదన్‌రావు, మల్లేష్‌గౌడ్, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిలో స్వాతీ నక్షత్ర పూజలు

వర్గల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వాతీనక్షత్ర పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతీ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ యాగశాలలో వేదపండితులు స్వాతి నక్షత్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయ ప్రాంగణం, పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

సిద్దిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఎలుకంటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రింటర్‌ను అందజేశారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రింటర్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు దేవయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను మంగళవారం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్ అందజేశాడు. గ్రామానికి చెందిన షేక్ మదార్‌కు రూ.58,500, గాజులపాటి మధుకు రూ.14,500 విలువైన చెక్కులను అందచేశారు.

యుద్ధభేరీని విజయవంతం చేయాలి

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్, యూపీఎస్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు చేగూరి దేవరాజ్ ఆధ్వర్యంలో యూపీఎస్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ టీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ ఒక్కటై సీపీఎస్, యూపీఎస్‌పై వ్యతిరేకంగా పోరాడితే పాత పెన్షన్ విధానం అమల్లోకి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు మార్చి 2న ధర్నా చౌక్ వద్ద జరిగే యూపీఎస్ సీపీఎస్‌పై యుద్ధభేరీని విజయవంతం చేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనాయిపల్లి గ్రామానికి చెందిన దున్నపోతుల ఉప్పలవ్వ అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ. 6వేలు, 50 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు.

నేడు చేర్యాలలో శివాజీ శోభాయాత్ర

చేర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని శివాజీ మహరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ నుంచి శివాజీ విగ్రహం చౌరస్తా వరకు శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ర్యాలీ విజయవంతం కోసం ఇంటికొకరు చొప్పున తరలిరావాలని కోరారు. కార్యక్రమానికి ప్రముఖ వక్త దేశపతి అమోఘ్, హిందూ ధర్మ పరిరక్షకురాలు మహాకళ దేవికారెడ్డి హాజరవనున్నారని పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునిపూజలు చేశారు.

వరికి సస్యరక్షణ చేపట్టాలి

రాయపోల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో చౌడు భూముల్లో వరిచేలు ఎర్రబారి వేసిన కర్ర వేసినట్లు ఉండి పొలం అంతా బుడగలు వస్తే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాయపోల్ ఏవో నరేష్ సూచించారు. మంగళవారం ఆయన రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు.

వరుస చోరీలతో జనం బెంబేలు!

- చిన్నకోడూరు మండలంలో పనిచేయని సీసీ కెమెరాలు
- పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాల కట్టడి
- అంతుచిక్కని బైక్‌ల చోరీల మిస్టరీ



చిన్నకోడూరులో చోరీ జరిగిన ఓ ఇంట్లో చెల్లాచెదురుగా పడిఉన్న వస్తువులు(ఫైల్)



అంబేడ్కర్ చౌరస్తాలో వేలాడుతున్న సీసీ కెమెరా



పెద్దకోడూరులో కేబుల్ ఊడిన సీసీ కెమెరా

చిన్నకోడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియని దుండగులు గ్రామాల్లో యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు, పెద్దకోడూరులో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బైకుల చోరీ మాటున మతలబేంటో?

గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి వేళలో గ్రామాల్లో సంచరిస్తూ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైకులను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఎత్తుకెళ్లిన బైకులను గ్రామాల శివారు ప్రాంతాల్లో వదిలి వెళ్తున్నారు. చోరీ చేసిన బైక్‌లను వదిలి వెళ్లడం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. గత శుక్రవారం అర్ధరాత్రి చిన్నకోడూరులో జరిగిన చోరీలు మినహా మిగతా చోరీలు శనివారాల్లో అర్ధరాత్రిపూట జరగడం గమనార్హం. ఈ నేపథ్యంలో దుండగులు బైకుల చోరీ మాటున మతలబు ఏమై ఉంటుందోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

పని చేయని సీసీ కెమెరాలు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమని పోలీసు అధికారులు పదే పదే చెబుతుంటారు. అలాంటి సీసీ కెమెరాలు చాలా గ్రామాల్లో పనిచేయడం లేదు. గతంలో ప్రజాప్రతినిధులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు, దాతల సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొంత కాలం వాటి నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ, ఆ తర్వాత నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పోలీసు స్టేషన్ ఉన మండల కేంద్రాన్నే టార్గెట్‌గా చేసుకొని గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడుతుండటం గమనార్హం. మండల కేంద్రంతో పాటు, చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

గత నెల రోజుల వ్యవధిలో చోరీలు

- గత శుక్రవారం అర్ధరాత్రి చిన్నకోడూరులోని ఓ ఇంటి తాళం పగులగొట్టిన గుర్తు తెలియని దుండగులు ఇంట్లోని బీరువాలో ఉన్న 12.5 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి అదే గ్రామంలో రెండు బైక్‌లను (స్కూటీ, బైక్) గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లి చిన్నకోడూరు గ్రామ శివారులో స్కూటీని, మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారులో బైకును వదిలి వెళ్లారు.
- ఫిబ్రవరి 1న అర్ధరాత్రి చిన్నకోడూరులో ఓ బైక్‌ను ఎత్తుకెళ్లి సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామ శివారులో వదిలి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి పెద్దకోడూరులో ఓ మేకను ఎత్తుకెళ్లారు.
- దాదాపు నెల రోజుల క్రితం చిన్నకోడూరులో ఓ పాకలో నుంచి అర్ధరాత్రి గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్లడానికి దుండగులు యత్నించారు. శబ్ధం కావడంతో అక్కడే నిద్రిస్తున్న కాపరి కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. అదేరోజు అర్ధరాత్రి పెద్దకోడూరులో ఓ బైక్‌ను దొంగలించడంతో పాటు, ఓ మేకను ఎత్తుకెళ్లారు. దొంగలించిన బైక్‌ను సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి శివారులో వదిలి వెళ్లారు.

సకాలంలో మున్సిపల్ పన్ను చెల్లించాలి



సిద్దిపేటలో నిర్మాణం పూర్తయిన భవనానికి కొలతలు వేసి పరిశీలిస్తున్న కమిషనర్ ఆశ్రిత్‌కమార్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ ఆశ్రిత్‌కమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన ప్రతీ భవనానికి ఇంటి నెంబర్ జారీ చేయాలని, కమర్షియల్ షెడ్లు, పెట్రోల్ బంకులు ఇతర గోదాములు ఉన్నవాటికి తప్పనిసరిగా ఇంటి నెంబరు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మార్చి 31వరకు వందశాతం పన్ను వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్మాణం పూర్తయిన భవనం ట్యాక్స్‌పై కొలతలు వేసి పరిశీలించారు. పట్టణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రీకాంత్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్‌ను అందించాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో సిద్దిపేట పట్టణం జాతీయస్థాయిలో మరోసారి మెరిసేలా సిద్దిపేట పట్టణ ప్రజలు తమవంతు సహకారం అందజేస్తూ స్వచ్ఛ సర్వేక్షణ్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను అందించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఏర్పాటు చేసిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ అవగాహన సదస్సులో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ ఏటా ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో అందరి సహకారంతో జాతీయస్థాయిలో సిద్దిపేట పట్టణానికి ఎన్నో అవార్డులు వచ్చినట్లు వివరించారు. ఈసారి కూడా పట్టణ ప్రజలంతా కూడా సిటీజన్ ఫీడ్‌బ్యాక్‌లో పాల్గొని సిద్దిపేటను అగ్రస్థానంలో నిలపాలని కోరారు.

మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు



చేర్యాలలోని పెద్దమ్మగడ్డ కాలనీలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చిన్నకోడూరు/చేర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) :గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్, చేర్యాల మండల కేంద్రంలోని పెద్దమ్మగడ్డ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం పోలీసులు వేర్వేరుగా కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. చిన్నకోడూరులో నార్కోటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న రెండు బెల్ట్ షాపులపై రైడ్ చేసి 16 లీటర్ల మద్యం సీసాలు, ఎలాంటి పేపర్లు లేని 32మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.కార్యక్రమంలో సిద్దిపేట రూరల్, దుబ్బాక సీఐలు శ్రీను, శ్రీనివాస్, ఎస్ఐలు బాలకృష్ణ, ఆసీఫ్, హరీశ్, పరశురామ్, ఏఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చేర్యాల పట్టణంలోని పెద్దమ్మగడ్డ కాలనీలో ధ్రువీకరణపత్రాలు లేని 22 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చేర్యాల సీఐ ఎల్ శ్రీను మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకుని భద్రతాభావం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేశ్, కొమురవెల్లి ఎస్ఐ రాజు, మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్, ప్రొబెషనరీ ఎస్ఐ మానసరెడ్డి, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలి



పంచాయతీలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పరిధిలో మౌలిక వసతుల కోసం గ్రామపంచాయతీ సాధారణ నిధులకు ట్రెజరీతో అనుసంధానం లేకుండా నేరుగా చెల్లింపులు జరిపేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని గ్రామ పంచాయతీల కార్యదర్శులు కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీలలో గత ఆగస్టు నుంచి పెండింగ్ లో ఉన్న చెక్కుల చెల్లింపులు. గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం నిధులను విడుదల చేయాలని దౌల్తాబాద్ ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మకు కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత ఆగస్టు నుంచి ఐఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే పేమెంట్ చేయాలన్నారు. నిధులు అందుబాటులో లేని గ్రామ పంచాయతీల్లో ఖర్చు చేసిన డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు.

గ్రామ పంచాయతీల నిర్వహణకు అవసరమున్న నిధులకు నేరుగా టీఎస్ బీపాస్ ఖాతాకు నిధులు విడుదల చేయాలన్నారు. ఇప్పటి వరకు తాము ఖర్చు చేసిన డబ్బులను ఈ నెల 28లోగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే పంచాయతీల నిర్వహణ సాధ్యం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భిక్షపతి, హంసకేతన్, రాజేష్, రాధా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ

మర్కుక్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు సిద్దిపేట జిల్లా బాలుర జట్టు శిక్షణ పూర్తి చేసుకున్నది. ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లాలో జరిగే పోటీలలో పాల్గొననున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏకలవ్య కబడ్డీ క్లబ్ మర్కుక్ వారి ఆధ్వర్యంలో నెల రోజుల క్యాంపు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏకలవ్య కబడ్డీ అధ్యక్షుడు, మర్కుక్ మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజబోయిన కృష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు ఆధ్వర్యంలో నెల రోజులుగా క్యాంపు నిర్వహించారు. మంగళవారం స్థానిక మాజీ ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డిల సౌజన్యంతో నెల రోజుల క్యాంపునకు భోజన ఖర్చులు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాయత్రి, బాలనర్సయ్య, ఉపసర్పంచ్ అంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పత్తి బాబు, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మున్సిఫ్ కోర్టు జడ్జి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి కృష్ణ తేజ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిఫ్ కోర్టు జడ్జికృష్ణ తేజ్ సందర్శించారు. వైద్యం అందుతున్న తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ ఉన్నారు.

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి



బేగంపేటలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సిద్దిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి నుంచి బేగంపేట వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని బేగంపేట గ్రామస్థులు రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో బెజ్జంకి నుంచి బేగంపేట వరకు రోడ్డు కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు పనులను పూర్తి కాక దుమ్ము, ధూళితో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థుల నిరసనకు బీఆర్ఎస్, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బెజ్జంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య అన్నారు. మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనుల రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల వద్ద కూలీలు లేకపోవడంతో అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

బ్యాంకర్లతో సమావేశమైన నాబార్డు డీడీఎం

హుస్నాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ఐవోసీ కార్యాలయంలో మంగళవారం బ్లాక్ లెవెల్ బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులతో నాబార్డు డీడీఎం నిఖిల్‌రెడ్డి సమావేశమయ్యారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, పీఎం ఎఫ్‌ఎంఈ తదితర ప్రభుత్వ పథకాలు, స్వయం సహాయక బృందాల పురోగతిని సమీక్షించారు.



లబ్ధిదారులకు కేటాయించినా పూర్తి కాని 'డబుల్' ఇళ్లు

మురిపించారు.. మరిచారు

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారులు ఆ ఇళ్లలో ఉండటానికి అవకాశం లేకుండా పోయింది. దాదాపు ఎనిమిది నిర్వాసిత కుటుంబాలు ఇందులో ఉంటున్నాయి. తమ సమస్యలు పూర్తిగా పరిష్కరించిన తర్వాతనే ఆ ఇళ్లను ఖాళీ చేస్తామని నిర్వాసిత కుటుంబాలు తేల్చిచెబుతున్నాయి.

కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకనే..

ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడం వల్లే వీటిని పూర్తి చేయడం లేదనే సమాచారం. దాదాపు రూ. 60 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, ప్రస్తుతం వీటిని నిర్మాణం పూర్తి చేస్తే గత బిల్లులు ఎవరు ఇస్తారు..? ప్రస్తుతం నిర్మాణం చేసినా బిల్లులు ఎవరు ఇస్తారనేది తెలియక వీటికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. ఇళ్లకు పట్టాలు ఇచ్చి మురిపించారని, వాటిని నిర్మాణం పూర్తిచేయక ఏడిపిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

- పట్టుబడినవారిలో ముగ్గురికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 30మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని మంగళవారం ఆయా కోర్టులలో ప్రవేశపెట్టగా విచారణ అనంతరం న్యాయాధికారులు జరిమానా విధించారు. వారిలో ముగ్గురికి జరిమానాతో పాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 9మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.14,500 జరిమానా విధించారు. వారిలో ఒకరికి ఐదు రోజులు, మరొకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ వివరించారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 21 మంది పట్టుబడినట్టు ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట మంగళవారం కోర్టులో హాజరు పరచగా రూ.15వేల జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి జరిమానాతో పాటు 3రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ వివరించారు.

చెరువులో ఏర్పాటు చేసిన మోటార్లు సీజ్



చెరువు వద్ద బిగించిన మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

దూళిమిట్ట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూటిగల్ చెరువులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన మోటార్లను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. కూటిగల్ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా స్థానిక చెరువులో మోటార్లు, పైపులు వేసి, విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా స్తంభాల వైర్లకు నేరుగా కనెక్షన్ ఇచ్చుకొని దాదాపు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ పొలాలకు నీటిని తరలిస్తున్నారు. ఇలా చెరువులో ఉన్న మొత్తం నీటిని తోడేయడం వలన చేపలు చనిపోయే ప్రమాదం ఉందని గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ మధుసూధన్, ఇరిగేషన్ ఏఈ రమేష్ చెరువులో ఏర్పాటు చేసిన మోటార్లను, పైపులను పరిశీలించి సీజ్ చేశారు. విద్యుత్ అధికారులు పోల్స్‌పై అనుమతి లేకుండా వేసిన వైర్లను తొలగించారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డా. శరత్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫార్మా రంగంలో కెమిస్ట్రీకి గల ఉపాధి అవకాశాలపై సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్ ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ మానవ వనరుల విభాగానికి చెందిన డా. శరత్ ప్రముఖ వక్తగా హాజరై విద్యార్థులకు ఫార్మా రంగంలో వివిధ విభాగాల్లో గల ఉద్యోగ అవకాశాలను గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కెమిస్ట్రీ విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సంపత్ కుమార్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ విభాగాధిపతి డా. గోపాలసుదర్శనం, ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ డా. మధుసూదన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి శ్రీధర్, రసాయన శాస్త్రం అధ్యాపకులు డాక్టర్ జి. రవికుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సుమలత డాక్టర్ జి శ్రీనివాస్, డాక్టర్ బి బాలకిషన్, డాక్టర్ బి మనోహర్, డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులు ఇష్టపడి చదవాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున ఇష్టపడి చదవాలని, తలదించుకొని పుస్తకాలను చదివితే జీవితంలో తలెత్తుకునేలా స్థిరపడతారని జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేటలోని సెయింట్ విన్సెంట్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీం నిర్వహిస్తున్న విధుల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బిందు మాచర్ల, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీం బృందం సభ్యులు శ్రీరాములు, మహేష్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

గజ్వేల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రణాళిక అభివృద్ధి కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. సమావేశంలో సీపీడీసీ సభ్యులు రాజమౌళి, గోపాల్‌రెడ్డి, డాక్టర్ నరేశ్‌బాబు, లక్ష్మణ్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం అసాధ్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): తలకిందులుగా తపస్సు చేసినా, ఎన్ని జన్మలెత్తిన బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్ని మాయమాటలు చెప్పినా బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. సమావేశంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

యోగాతో పాటు ధ్యానాన్ని అలవర్చుకోవాలి: ఏసీపీ

గజ్వేల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): యోగాతో పాటు మానసిక ధ్యానాన్ని అలవర్చుకోవాలని గజ్వేల్ ఏసీపీ కె. పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ మండల పరిధిలోని కోమటిబండలోని పాండవ కృష్ణ ధ్యాన క్షేత్రం సప్తమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడిని అధిగమించాలంటే శారీరక యోగాసనాలతో పాటు ధ్యానాన్ని అలవర్చుకోవాలన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నంగునూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం సిద్దన్నపేట రైతులతో కలిసి ఎర్రకుంట, ఇప్పలకుంట చెరువులలోకి నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువను తవ్వించారు. ఇటీవల అన్ని గ్రామాలకు కాల్వల ద్వారా నీళ్లు అందిస్తున్నప్పటికీ తమ గ్రామానికి నీళ్లు రావడంలేదని మండలంలోని సిద్దన్నపేట గ్రామ రైతులు ఆందోళన చేసిన నేపథ్యంలో ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.